

28 నుంచి ధ్రువీకరణ పత్రాల పరిశీలన

నూజివీడు ట్రిపుల్ ఐటీ రిజిస్ట్రార్ అమరేంద్రకుమార్

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ట్రిపుల్ ఐటీ ఇడుపులపాయ, నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం క్యాంపస్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకున్న స్పెషల్ కేటగిరి విద్యార్థులకు ఈ నెల 28 నుంచి 31 వరకు నూజివీడు ట్రిపుల్ ఐటీలో ధ్రువీకరణ పత్రాల పరిశీలన ఉంటుందని రిజిస్ట్రార్ ఆచార్య అమరేంద్రకుమార్ తెలిపారు. క్రీడలు, సైనికోద్యోగుల పిల్లలు, ఎన్‌సిసి, భారత్ స్కౌట్స్, గైడ్స్ ధ్రువపత్రాలు ఉన్న విద్యార్థులకు రిజర్వేషన్ ప్రకారం సీట్లు కేటాయిస్తామన్నారు. దరఖాస్తు సమయంలో ప్రత్యేక కేటగిరి కింద దరఖాస్తు చేయడం మరచిపోయిన విద్యార్థులు కూడా నూజివీడులో జరిగే ధ్రువపత్రాల పరిశీలనకు హాజరయ్యే అవకాశం కల్పించామని తెలిపారు.

కౌలు రైతులను పక్కన పెట్టి.. భూ యజమానులకు పట్టం కట్టి..!



'అన్నదాత సుఖీభవ' అర్హుల జాబితా వెరిఫికేషన్ దాదాపు పూర్తి

రెండు జిల్లాల్లో రెండు లక్షల మంది వరకూ అర్హులుగాతేలే అవకాశం

వెబ్‌ల్యాండ్ ఆధారంగా జాబితా తయారు..

కౌలురైతులను పూర్తిగా పక్కకు పెట్టేసిన పరిస్థితి

సాగుకు దూరంగా ఉన్న భూ యజమానులకే అన్నదాత సుఖీభవ సొమ్ములు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

రైతులకు పెట్టుబడి సాయం కింద అందించే 'అన్నదాత సుఖీభవ' పథకంలో కౌలు రైతులను పూర్తిగా పక్కకు పెట్టేసి, భూ యజమానులకు సాయం అందించే విధంగా ప్రభుత్వం జాబితా సిద్ధం చేస్తోంది. దీంతో వాస్తవ సాగుదారుడైన కౌలు రైతుకు తీరని అన్యాయం జరిగే పరిస్థితి ఏర్పడింది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో మూడు లక్షల మంది కౌలు రైతులకు అన్యాయం జరిగే పరిస్థితి నెలకొంది. ఖరీఫ్ ఆరంభం నాటికి అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు పెట్టుబడి సాయం జమచేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. కేంద్ర ప్రభుత్వం పిఎం కిసాన్ సొమ్ములు జమ చేసేటప్పుడు, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే సొమ్ములు జమ చేస్తామని చెప్పింది. కేంద్ర ప్రభుత్వం పిఎం కిసాన్ కింద రూ.రెండు వేలు చొప్పున మూడు విడతలుగా సొమ్ములు జమ చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.20 వేలులో కేంద్రం ఇచ్చే రూ.ఆరు వేలు పోను.. మిగిలిన రూ.14 వేలు పిఎం కిసాన్‌తోపాటు మూడు విడతలుగా జమ చేయనున్నట్లు ప్రభుత్వం చెబుతోంది. మరో రెండు వారాల్లో ఖరీఫ్ సాగు ప్రారంభం కానుంది. దీంతో అన్నదాత సుఖీభవ జాబితాను సిద్ధంచేసే పనిలో వ్యవసాయశాఖ అధికారులు ముమ్మరంగా పనిచేస్తున్నారు. ఈ క్రమంలో ఈ నెల 20వ తేదీకే జిల్లాల నుంచి జాబితా సిద్ధం చేసి పంపించాలని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. రబీ ధాన్యం కొనుగోలు పూర్తికాకపోవడంతో జాబితా ఆలస్యమైంది. దీంతో గడువు పెంచారు. ఈ నెల 27వ తేదీ నాటికి జాబితా పంపించాల్సి ఉంది. ఇప్పటికే అన్నదాత సుఖీభవ జాబితాకు సంబంధించి వెరిఫికేషన్ ప్రక్రియ దాదాపు పూర్తయ్యే దశకు చేరుకుంది. వెబ్‌ల్యాండ్ ఆధారంగా అర్హులను ఎంపిక చేస్తున్నారు. వెబ్‌ల్యాండ్ భూ యజమానుల పేర్లు తప్ప కౌలురైతుల పేర్లు ఒక్కటి కూడా లేని పరిస్థితి ఉంది. ఏలూరు జిల్లాలో వెబ్‌ల్యాండ్ జాబితాలో మొత్తం 4,02,879 మంది భూ యజమానుల పేర్లు ఉన్నాయి. ఆక్వా చెరువులు, ల్యాండ్ కన్వర్షన్, ప్రభుత్వ ఉద్యోగులు, వంటి వారి పేర్లను తొలగించి జాబితా తయారు చేస్తున్నారు. ముందుగా గ్రామంలోని వ్యవసాయాధికారి వెరిఫికేషన్ చేసి ఆ జాబితాను మండల వ్యవసాయశాఖ అధికారికి పంపించారు. అక్కడ వెరిఫికేషన్ జరిగిన తర్వాత సర్వే నెంబర్లపై సమస్యలున్న వాటిని తహాశీల్దార్‌కు పంపిస్తున్నారు. తర్వాత జిల్లా స్థాయిలో, ఆ తర్వాత ఆర్‌టిజిఎస్ (రియల్‌టైం గవర్ననెసెస్) వెరిఫికేషన్ జరిగి తుదిజాబితా తయారు కానుంది. ఏలూరు జిల్లాలో ఇప్పటి వరకూ మండలస్థాయి వెరిఫికేషన్ పూర్తయ్యే సరికి లక్షా 82 వేల మంది వరకూ జాబితాలో ఉన్నారు. ఇంకా వెరిఫికేషన్ జరుగుతోంది. అది కూడా పూర్తయ్యే సరికి లక్షా 20 వేల మంది పేర్లు తుది జాబితాలో ఉంటే అవకాశం ఉందని తెలుస్తోంది. పశ్చిమగోదావరి జిల్లాలో 2.99 లక్షల మంది వెబ్‌ల్యాండ్ జాబితాలో ఉండగా ఇప్పటివరకూ వెరిఫికేషన్‌లో లక్షా 59 వేల మంది మిగిలారు. పూర్తి వెరిఫికేషన్ పూర్తయ్యే సరికి 90 వేల మంది పేర్లు జాబితాలో ఉండే అవకాశం ఉండనున్నట్లు అంచనా వేస్తున్నారు. పిఎం కిసాన్ జాబితా సంఖ్య ఉన్నట్లుగానే అన్నదాత సుఖీభవ జాబితా ఉండనుందని తెలుస్తోంది.

కౌలు రైతులు పూర్తిగా పక్కకు..

పెట్టుబడి సాయం అనేది సాగుచేసే రైతుకు ఇవ్వాల్సి ఉంటుంది. ప్రభుత్వం మాత్రం అందుకు విరుద్ధంగా సాగుకు దూరంగా ఉన్న భూ యజమానులకు ఇస్తోంది. వెబ్‌ల్యాండ్‌లో ఉన్న భూ యజమానుల పేర్లు ఆధారంగానే జాబితా తయారు చేస్తోంది. కౌలురైతుల జాబితా తయారీకి సంబంధించి ఎటువంటి ఉత్తర్వులు జారీ చేయలేదు. దీంతో అధికారులు భూ యజమానుల పేర్లతోనే అన్నదాత సుఖీభవ జాబితాను సిద్ధం చేస్తున్నారు. రెండు జిల్లాలో దాదాపు మూడు లక్షల మంది కౌలురైతులు ఉన్నారు. జిల్లా వ్యవసాయ సాగులో 80 శాతం వరకూ కౌలురైతులే సాగుచేస్తున్నారు. వ్యవసాయ సాగులో కీలక పాత్ర పోషిస్తున్న కౌలురైతులకు అన్నదాత సుఖీభవ కింద పెట్టుబడి సాయం అందించకపోవడం అత్యంత దారుణమన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కౌలుకార్డుల జారీ ప్రక్రియ సైతం ఎప్పటికి పూర్తిచేస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. కేంద్ర ప్రభుత్వం అందించే పిఎం కిసాన్ పథకంసైతం కౌలు రైతులకు అందకుండా చేశారు. ఇప్పుడు అన్నదాత సుఖీభవలోనూ కౌలురైతులకు చోటులేకుండా పోయింది. దీంతో కూటమి సర్కార్‌పై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



డిఇఒ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఉపాధ్యాయులు

సర్‌ప్లస్ పేరుతో ఒత్తిడి తగదు

డిఇఒ కార్యాయం వద్ద ఉపాధ్యాయుల ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

శనివారం రాత్రి ఉపాధ్యాయులను సర్‌ప్లస్ పేరుతో ఒత్తిడి చేసి బదిలీలకు దరఖాస్తు చేయించడాన్ని నిరసిస్తూ ఆదివారం ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో ఏలూరు జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం వద్ద మెరుపు ధర్నా నిర్వహించారు. రాష్ట్ర విద్యాశాఖ ఉన్నతాధికారులు ఇచ్చిన హామీ మేరకు విద్యార్థుల సంఖ్య 49 దాటితే 50 వద్ద రెండో సెక్షన్ ఇచ్చి ఆ మేరకు ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలనే డిమాండ్‌తో ధర్నా నిర్వహించారు. అయితే ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల విద్యాశాఖ అధికారులు చర్చలకు పిలిచి, నాయకత్వంతో మాట్లాడారు. విద్యార్థుల సంఖ్య 50 దాటితే రెండో సెక్షన్ అమలు చేస్తూ ఆ మేరకు సర్‌ప్లస్ పోస్టులను గుర్తిస్తామని, సరి చేస్తామని, దరఖాస్తు చేసిన వారి అప్లికేషన్ రద్దు చేస్తామని హామీ ఇచ్చిన మేరకు ఉపాధ్యాయులు ధర్నాను వాయిదా వేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ ఏలూరు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రవికుమార్ రుద్రాక్షి, షేక్ ముస్తఫా, పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షులు విజయరామరాజు, రాష్ట్ర కార్యదర్శి బి.సుభాషిని, ఎపిటిఎఫ్ 1938 ప్రధాన కార్యదర్శి మోహన్, డిటిఎఫ్ ప్రధాన కార్యదర్శి ఆదినారాయణ, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్ల మోసం

రూ.లక్షా 27,264 సొమ్ము మాయం

ప్రజాశక్తి - ముదినేపల్లి

సైబర్ నేరగాళ్ల మోసం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. క్రెడిట్ కార్డ్ నుంచి నేరగాళు సొమ్ము మాయం చేసిన ఈ సంఘటన ముదినేపల్లిలో జరిగింది. వివరాల్లోకి వెళితే ముదినేపల్లి అంబేద్కర్ కాలనీకి చెందిన యువకుడు రేమల్లి రవికుమార్ లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ముదినేపల్లి ఎస్‌బిఐ బ్రాంచ్‌లో రవికుమార్ క్రెడిట్ కార్డ్ కలిగి ఉన్నాడు. గత నెలలో రూ.లక్షా 8 వేలను ఆ క్రెడిట్ కార్డుపై వినియోగించుకుని కొద్ది రోజుల్లో తిరిగి బ్యాంకుకు జమ చేశాడు. గత నెల 28న ఎస్‌బిఐ సింబల్ కలిగియున్న ఒక ఫోన్ నంబర్ నుంచి రవికుమార్‌కు కాల్ వచ్చింది. ఎస్‌బిఐ నుంచి ఫోన్ చేస్తున్నాం మీరు క్రెడిట్ కార్డు వాడుకుంటారా, బ్లాక్ చేయమంటారా అని నేరగాళ్ళ రవి కుమార్‌ను అడిగారు. అప్పటికే క్రెడిట్ కార్డ్ వినియోగాన్ని నిలిపేద్దామని ఆలోచనలో ఉన్న రవికుమార్ కార్డును బ్లాక్ చేయమని చెప్పాడు. మీ నెంబర్‌కు వచ్చిన ఒటిపిని చెప్పమని నేరగాళ్లు అడుగ్గా, తన ఫోన్‌కు వచ్చిన ఒటిపి నెంబరు రవికుమార్ తెలిపారు. వెంటనే రవికుమార్ క్రెడిట్ కార్డ్ నుంచి రూ.1,27,264 నగదు కట్ అయ్యింది. దీంతో బాధితుడు లబోదిబోమంటూ జరిగిన సంఘటనపై ముదినేపల్లి పోలీసులు ఫిర్యాదు చేశాడు.

కేన్సర్‌తో వేదన.. గుంతలతో రోదన..!



అధ్వానంగా ఉన్న వంగాయగూడెం సెంటర్ నుంచి కేన్సర్ ఆసుపత్రికి వెళ్లే రోడ్డు

దారుణంగా వంగాయగూడెం కేన్సర్ ఆసుపత్రి రోడ్డు

ప్రయాణంలో కేన్సర్ రోగుల అవస్థలు వర్ణాతీతం

పట్టించుకోని ప్రజాప్రతినిధులు, ఏలూరు కార్పొరేషన్ అధికారులు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కేన్సర్‌తో పోరాడుతున్న రోగులకు ఆసుపత్రికి వెళ్లే రోడ్డుపై ప్రయాణం నరకయాతనగా మారిన పరిస్థితి. ఏలూరు కార్పొరేషన్ పరిధిలోని వంగాయగూడెంలోని గుడ్ సమరిటన్ కేన్సర్ ఆసుపత్రికి వెళ్లే రోడ్డు గుంతలతో అత్యంత దారుణంగా తయారైంది. ద్విచక్రవాహనంపై సైతం ప్రయాణించలేని స్థితిలో అడుగడుగునా గుంతలు ఏర్పడ్డాయి. వర్షాలకు భారీగా నీరు నిలిచిపోవడంతో అక్కడికి వెళ్లే రోగులు పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. సర్జరీలు, కీమో, రేడియషన్ చేయించుకున్న కేన్సర్ రోగుల పరిస్థితి ఏవిధంగా ఉంటుందో అందిరికీ తెలిసిందే. అలాంటి బాధలుపడుతున్న రోగులు నిత్యం ప్రయాణించే రోడ్డు గురించి అధికారులు గానీ, ప్రజాప్రతినిధులు గానీ పట్టించుకోకపోవడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రోడ్డుపై గుంతలు పూడ్చేశామంటూ కూటమి ప్రభుత్వం గొప్పలు చెప్పడం తప్ప ఆచరణలో అందుకు విరుద్ధమైన పరిస్థితి నెలకొంది. రోడ్ల మరమ్మతులకు రూ.కోట్లు ఖర్చు పెడుతున్నట్లు ప్రభుత్వం, అధికారులు చెబుతున్న మాటలకు, వాస్తవ పరిస్థితులకు పొంతన లేకుండా పోతోంది. వంగాయగూడెం సెంటర్ నుంచి కేన్సర్ ఆసుపత్రికి వెళ్లే మార్గమంతా అత్యంత దారుణంగా మారింది. వంగాయగూడెంలోని కేన్సర్ ఆసుపత్రికి నిత్యం సుమారు 300 మంది కేన్సర్ రోగులు చికిత్స నిమిత్తం వస్తుంటారు. వారిలో రకరకాల అవయవాలకు చెందిన కేన్సర్‌కు సంబంధించి వివిధ స్టేజీల్లో ఉండి శారీరకంగా బాధలు పడుతుంటారు. ఆసుపత్రికి వచ్చే రోగుల్లో 99 శాతం పేద రోగులే. ఎన్‌టిఆర్ వైద్యసేవ ద్వారా చికిత్స పొందేవారే. రోగులంతా ఆటోల్లో, ద్విచక్ర వాహనాలపై ఆసుపత్రికి వస్తున్నప్పుడు వాహనాలు ఆ గోతుల్లో పడినప్పుడు రోగుల అవయవాలు విపరీతమైన నొప్పికి గురవడంతో నిత్యం నరకం చూస్తున్నారు. కేన్సర్ బాధితులకు ఈ రోడ్డు ఒక శాపంలా మారింది. కేన్సర్ ఆసుపత్రి వరకూ ఏలూరు కార్పొరేషన్ పరిధిలోకే వస్తోంది. కార్పొరేషన్ అధికారులకు గానీ, పాలకులకు గానీ ఈ రోడ్డు ఎందుకు కనిపించలేదో అర్థం కావడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని వెంటనే మరమ్మతులు చేస్తే రోగులకు కొంత ఊరట లభిస్తుంది. అంతేగాక నిత్యం ఏలూరు పని మీద వచ్చే పెదపాడు, బూరాయిగూడెం, కొత్తూరు, ముప్పర్రు వంటి గ్రామాలకు నిత్యం వందల మంది వెళుంటారు. అంతేగాక ఇటువైపు నిత్యం చేపల చెరువుల నుంచి చేపల లోడుతో లారీలు, గడ్డి ట్రాక్టర్లు తిరుగుతూ ఉంటాయి. కొద్దిపాటి వర్షానికి రోడ్డంతా జలమయమై ఈ లారీలు తిరుగుతుంటే రోడ్డు మరింత గోతులు పడి ఎప్పుడు ఎవరు ప్రమాదం బారిన పడతారో, ఎవరు ప్రాణాలు పోతాయో అన్నట్లుగా పరిస్థితి ఉంది. దీనిపై కార్పొరేషన్ అధికారులు తమకు సంబంధం లేదన్నట్టు చెబుతుండగా ఆర్ అండ్ బి అధికారులు పట్టించుకోని పరిస్థితి నెలకొంది.



పెద్ద పెద్ద గోతులతో అధ్వానంగా ఉన్న రోడ్డు

దేవాదాయ అధికారులతో ఎంఎల్ఎ సమీక్ష

ప్రజాశక్తి - ఉంగుటూరు

నియోజకవర్గంలో దేవాదాయ ధర్మదాయ శాఖ అధికారులు, ఇఒలతో ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో సమీక్షించారు. ఎండోమెంట్‌కు సంబంధించి, ప్రయివేటు భూములు ఎన్ని తగాదాల్లో ఉన్నాయి, కోర్టు కేసులు ఏమైనా ఉన్నాయా, తదితర అంశాలపై చర్చించారు. గతంలో అభివృద్ధి పనులు చేసిన వాటికి బిల్లుల పెండింగ్ వివరాలు, శ్రీవాణీ స్కీమ్ ద్వారా కొత్తగా నిర్మించే ఆలయాలు, ప్రస్తుతం నిధుల లభ్యత, దేవాలయాలకు చెందిన పొలాలు, చెరువుల వేలం పాట, కౌలుదారుల వివరాలపై అధికారులు సమాచారం అందించారు. అనంతరం ఉంగుటూరు మండల రేషన్ డీలర్లతో ఎంఎల్ఎ సమావేశం నిర్వహించి జూన్ 1 నుంచి రేషన్ సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలని ఆదేశించారు.



అధికారులతో సమీక్షిస్తున్న ఎంఎల్ఎ ధర్మారాజు

చాక్లెట్ పరిశ్రమ ఏర్పాటుకు కృషి

చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి ప్రాంతంలో చాక్లెట్ పరిశ్రమ ఏర్పాటు చేస్తామని చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ తెలిపారు. అల్లిపల్లిలో నిర్మించిన కోకో ఫెర్మెంటేషన్ ప్లాంట్‌ను ఆయన ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఏకైక కోకో ఫర్మెంటేషన్ ప్లాంట్ చింతలపూడి మండలం అల్లిపల్లిలో ఉండడం హర్షణీయమన్నారు. జిల్లాలో కోకో సుమారు 31 శాతం చింతలపూడి నియోజకవర్గంలో సాగవుతుందని, అందుకోసం పరిశ్రమలు స్థాపించడానికి కృషి చేస్తానని చెప్పారు. ఇక్కడ పండించిన పంటకు సంబంధించిన ఉత్పత్తులు స్థానికంగా చేయగలిగితే తక్కువ ఖర్చుతో అధిక లాభాలు పొందడానికి, రైతులకు గిట్టుబాటు ధర అందించడానికి, ఉపాధి కల్పన ద్వారా యువతను ఆదుకోవడానికి పారిశ్రామికవేత్తలకు అవకాశం ఉంటుందన్నారు. చాక్లెట్ పరిశ్రమ ఏర్పాటు చేయడానికి అనువైన పరిస్థితులు, ముడి సరుకు, మానవ వనరులు చింతలపూడి ప్రాంతంలో అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ మేరకు ప్రభుత్వం కూడా చేయూత అందించడానికి సిద్ధంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కోకో రైతులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్

ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా యూనిట్ ఎన్నికలు ఆదివారం స్థానిక ఉద్యోగ సంఘ జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. ముందుగా అభ్యర్థులు నామినేషన్లు వేసిన తర్వాత పరిశీలన, ఉపసంహారాల అనంతరం కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి కె.కేదారేశ్వరరావు తెలిపారు. ఎన్నికల పరిశీలకులుగా ఎపిజిఇఎ రాష్ట్ర కార్యదర్శి భూపాతిరాజు రవీంద్ర రాజు విచ్చేశారు. వారి ఆధ్వర్యంలో జిల్లా కార్యవర్గ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అనంతరం ఎన్నికైన వారితో ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రమాణస్వీకారం చేయించారు. ఎన్నికైనా కార్యవర్గాన్ని పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా కార్యవర్గ అధ్యక్షులుగా ఎన్నికైన ఎన్‌ఎస్‌వి.రామకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే ఐ.ఆర్ ఇవ్వాలని, డిఎ ప్రకటించాలని, జ్యూడిషల్ పిఆర్‌సి కమిటీ వేయాలని, ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. జిల్లా కార్యదర్శిగా అనంతల బంగారయ్య, ట్రెజరర్‌గా జాహిద్ యాస్ధాని, తదితర సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

షెడ్యూల్ ప్రాంత ఉద్యోగ నియామక చట్టం చేయాలి

కొనసాగిన రిలే నిరాహార దీక్షలు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

షెడ్యూల్ ప్రాంత ఉద్యోగ నియామక చట్టం చేయాలని కోరుతూ ఆదివాసీ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో బుట్టాయగూడెం తహశీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 11వ రోజు ఆదివారం కొనసాగాయి. ఈ దీక్షలను ఎటిఎ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు తెల్లం రాములు ప్రారంభించి మాట్లాడారు. షెడ్యూల్ ప్రాంత ఉద్యోగ నియామకాల చట్టం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దీక్షలకు ఆదివాసీ మెడికల్ అండ్ హెల్త్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు సున్నం శ్రీరాములు దొర, ఆదివాసీ హెల్త్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం వెంకటేష్ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో ప్రత్యేక నోటిఫికేషన్ ద్వారా డిఎస్‌సిని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ రిలే నిరాహార దీక్షల్లో ఎం.శ్రీను, జిల్లా వైస్ ప్రెసిడెంట్ తెల్లం పోచమ్మ, జిల్లా జాయింట్ సెక్రటరీ కోటం సువర్ణ, సవలం దుర్గాప్రసాద్, పూనెం చిన్న దుర్గారావు, సవలం రమేష్, ఊరికే రవీంద్రబాబు, మడకం సీతామహాలక్ష్మి, దువ్వెల దుర్గారావు, పట్ల రమేష్ రెడ్డి, కారం వాసు, సోదెం ముక్కయ్య, తెల్లం లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.



రిలే నిరాహార దీక్షల్లో నేతలు

ఆదరణ లేని బాల బాలికలు కనిపిస్తే చెప్పండి

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ప్యానల్ లాయర్లు, పారా లీగల్ వాలంటీర్లు

రైల్వేస్టేషన్, బస్‌స్టేషన్‌లో తనిఖీలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

అంతర్జాతీయ తప్పిపోయిన పిల్లల దినోత్సవం సందర్భంగా రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ప్యానల్ లాయర్లు, పారా లీగల్ వాలంటీర్లు పట్టణంలోని రైల్వే స్టేషన్, బస్ స్టేషన్‌లో ఆదివారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్యానెల్ లాయర్లు సంబంధిత అధికారులతో మాట్లాడుతూ ఎవరైనా బాలబాలికలు ఒంటరిగా, అనుమానాస్పదంగా లేదా ఎటువంటి ఆదరణ లేని వారు కనిపిస్తే జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు ప్రత్యక్షంగా లేదా 08812 22455, 15100 నెంబర్లకు గాని, చైల్డ్ హెల్ప్ లైన్1098కు గాని సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఇటువంటి నిరాదారణ బాలబాలికలకు ప్రభుత్వం వారు ఆశ్రయం కల్పించి విద్య, వైద్యం, ఆహారం మొదలైన సౌకర్యాలు కల్పించనున్నట్లు తెలిపారు. సంబంధిత అధికారులతో పాటు పౌరులు కూడా బాధ్యతాయుతంగా ఉంటే ఈ సమస్యను అధిగమించవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో లాయర్లు జివి.భాస్కర్, బి.సంగీతరావు, ఎ.గంగాభవాని, పారా లీగల్ వాలంటీర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



తనిఖీలు చేస్తున్న లాయర్లు, పారా లీగల్ వాలంటీర్లు

బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు

456 కేసులు నమోదు, 478 మంది అరెస్ట్

ఎంఆర్‌పికే మద్యం విక్రయించాలి

జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆవులయ్య

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో ఎక్కడా బెల్ట్ షాపులు లేకుండా చర్యలు తీసుకున్నామని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆవులయ్య చెప్పారు. ఏలూరు న్యూ అశోక్‌నగర్‌లోని తమ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో బెల్టు షాపుల విషయంలో కఠినంగా వ్యవహరిస్తున్నామని, ఇప్పటివరకు 456 కేసులు నమోదు చేసి 478 మందిని అరెస్ట్ చేయడంతో పాటు బెల్ట్ షాపులకు మద్యాన్ని సరఫరా చేస్తున్న కుక్కునూరు, ఏలూరు రూరల్, పెదవేగి మండలం, భీమడోలులోని ఐదు వైన్ షాపులను సీజ్ చేసి, రూ.ఐదు లక్షల చొప్పున అపరాధ రుసుం విధించామన్నారు. జిల్లాలో మొత్తం లైసెన్స్ పొందిన 155 మద్యం షాపులు ఉన్నాయని, మద్యం షాపుల్లో కచ్చితంగా ఎంఆర్‌పికే మద్యం అమ్మేలా చర్యలు తీసుకుంటున్నామని, రాత్రి పది గంటల తర్వాత షాపులో మద్యం అమ్మకుండా విస్తృత తనిఖీలు చేస్తున్నామని చెప్పారు. చింతలపూడి మండలం ఎర్రగుంటపల్లిలో ఎంఆర్‌పి కన్నా అదనంగా మద్యాన్ని అమ్ముతున్న కనకదుర్గ వైన్స్‌పై కేసులు నమోదు చేశామని తెలిపారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం నేరమని, జిల్లాలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న 70 మందిపై కేసులు నమోదు చేశామని చెప్పారు. జిల్లాను మే 31వ తేదీ నాటికి నాటు సారా రహిత జిల్లాగా రూపొందించేందుకు తీసుకుంటున్నామని, జిల్లాలోని 140 గ్రామాల్లో నాటు సారా తయారీదారులు ఉన్నారని, ఆ గ్రామాల్లో దాడులు నిర్వహించి నాటుసారా తయారు కాకుండా చర్యలు తీసుకుని, వారికి నవోదయం-2 పథకం ద్వారా ప్రత్యామ్నాయ ఉపాధి కార్యక్రమాలు కల్పిస్తున్నామని చెప్పారు. ఆ గ్రామంలోని 35 కుటుంబాలకు చెందిన 138 మంది మహిళలకు ఉన్నతి, స్త్రీ నిధి పథకాల ద్వారా వడ్డీ లేని రుణాలు అందించి స్వయం ఉపాధి ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లాలో ఎక్కడైనా మద్యం షాపులు, నాటు సారా విషయాలపై 14405 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చని, వెంటనే చర్యలు తీసుకుంటామని ఆవులయ్య చెప్పారు.

భారీ వర్షాలు.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

ఈ నెల 27వ తేదీ మంగళవారం నాటికి పశ్చిమమధ్య బంగాళాఖాతం, ఆనుకుని ఉన్న ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనున్న నేపథ్యంలో రాష్ట్రంలో రానున్న నాలుగు రోజులు అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరిక దృష్ట్యా జిల్లాలోని అన్ని శాఖల అధికారులను కలెక్టర్ కె.వెట్రిసెల్వి అప్రమత్తం చేశారు. ముఖ్యంగా విద్యుత్ శాఖాధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. 26న జిల్లాలో అక్కడక్కడ మోస్తారు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. 27న జిల్లాలో పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురుస్తాయని, గంటకు 60 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించిందని, ఈ దృష్ట్యా ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నందున హోర్డింగ్స్, చెట్ల కింద, శిథిలావస్థలో ఉన్న గోడలు, భవనాల దగ్గర నిల్చోరాదని చెప్పారు. పిడుగులతో కూడిన వర్షాలు నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఇప్పటినుంచే ఉద్యానవన రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అవసరమైతే లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే విధంగా రెవెన్యూ సిబ్బంది ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రతి మండలం ప్రధాన కేంద్రంలో, డివిజన్ ప్రధాన కేంద్రాల్లో రెవెన్యూ సిబ్బంది 24/7 అందుబాటులో ఉండాలని తెలిపారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల ఎలాంటి నష్టం జరగకుండా అప్రమత్తంగా ఉండి ముందస్తుగానే పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఎక్కడైనా అత్యవసర పరిస్థితి ఏర్పడితే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

కొనసాగిన వేసవి విజ్ఞాన తరగతులు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతులు 23వ రోజు ఆదివారం కొనసాగాయి. చిన్నారులు శిక్షణ తరగతులకు క్రమం తప్పకుండా హాజరవుతున్నారు. చదవటం మాకిష్టంలో భాగంగా చిన్నారులతో కథలు చదివించడం, చెప్పించడం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. తొలుత రిసోర్స్‌పర్సన్ జి.వి.ఆనందరావు మాట్లాడుతూ లక్ష్యాన్ని చేరుకోవాలంటే తగిన వార్తాపత్రికలను చదవడం అలవాటు చేసుకోవాలని చెప్పారు. సమయపాలన కూడా ఎంతో అవసరమన్నారు. చిన్నతనం నుంచి మంచి అలవాట్లు కలిగి ఉండాలని, పెద్దవారిని గౌరవించాలని, క్రమశిక్షణ అనేది ఈ వయస్సు నుంచే నేర్చుకోవాలని తెలిపారు. ఈ లక్షణాలన్నీ కలిగి ఉంటే భవిష్యత్తులో మీరు అనుకున్న లక్ష్యాన్ని చేరుకోగలరంటూ విజ్ఞానంతో కూడిన సందేశాన్ని అందించారు. అనంతరం చిన్నారులతో ఫన్నీ గేమ్ ఆడించి స్నాక్స్ పంపిణీ చేశారు. ఈ శిక్షణ కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ ఎ.నారాయణరావు, బి.రమేష్, ఎమ్.డి.అస్లాం పాషా, విద్యార్థులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవి పిల్లలకు పౌష్టికాహారం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

స్వచ్ఛభారత్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక వంగాయగూడెంలోని యాపిల్ కేర్, సపోర్ట్ సెంటర్‌లో ఉన్న హెచ్‌ఐవి పిల్లలకు పౌష్టికాహారం అందించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన అసోసియేషన్ కోశాధికారి వైఎస్.కనకారావు మాట్లాడుతూ గత పదేళ్లుగా ఈ సంస్థలో ఉన్న పిల్లలకు పౌష్టికాహారం, ప్రోటీన్ ఫుడ్ అందిస్తున్నామని తెలిపారు. హెచ్‌ఐవి బాధితులు మనోధైర్యంతో జీవించాలని, మంచి ఆహారం తీసుకుంటూ డాక్టర్ల సలహా మేరకు మందులు వాడటం ద్వారా జీవిత కాలాన్ని మరింత పెంచుకోవచ్చని చెప్పారు. ఖర్జూరం, అటుకులు, బెల్లం, వేరుశనగ గుళ్ళు, రాగి పిండి ఇతర పౌష్టికాహారం కలిగిన కిట్లను హెచ్‌ఐవి బాధితులకు స్వచ్ఛభారత్ వర్కర్స్ అసోసియేషన్ సభ్యులు అందించారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు మద్యాహ్నం వెంకటేశ్వరరావు, అధ్యక్ష, కార్యదర్శులు కల్లూరు చంద్రశేఖర్, చేకూరు వెంకటేశ్వరరావు, కొండేటి పోతురాజు, తదిత

టిడిపి పట్టణ అధ్యక్షులుగా రామకృష్ణారావు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

టిడిపి కొయ్యలగూడెం పట్టణ అధ్యక్షులుగా రామకృష్ణారావు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు గంగిరెడ్ల మేఘలదేవి మాట్లాడుతూ పట్టణ అధ్యక్షులుగా రామకృష్ణారావు పార్టీ అభివృద్ధికి, అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం విజయం సాధించడానికి చేసిన కృషి మరువలేనిదన్నారు. పట్టణ అభివృద్ధికి సహకరిస్తున్న రామకృష్ణారావును రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు తెలిపారు. ఉపాధ్యక్షులుగా సీనియర్ నాయకులు ఆర్.వెంకటరమణ, ప్రధాన కార్యదర్శిగా షైదీమట రమేష్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మట్టా లక్ష్మీపతిరావు, మంచాల వెంకయ్యనాయుడు, పట్టణ మహిళా అధ్యక్షురాలు దొడ్డపనేని దుర్గాదేవి, నల్లపర్తి ధూర్జిరాజు, కొత్త రమ, రాచూరి మదన్, రౌతు శ్రీనివాస్, పూలపల్లి వెంకట్రావు, దొడ్డపనేని ఆంజనేయులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జులై 5, 6, 7 తేదీల్లో సిపిఐ మహాసభ

ప్రజాశక్తి - చింతలపూడి

సిపిఐ జిల్లా ద్వితీయ మహాసభ చింతలపూడి పట్టణంలో జులై 5, 6, 7 తేదీల్లో జరుగుతున్నాయని, వీటిని జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల కార్యదర్శి తొర్లపాటి బాబు పిలుపునిచ్చారు. చింతలపూడి నగర పంచాయతీ పాత చింతలపూడి సిపిఐ శాఖ సమావేశం ముల్లగిరి నాగేశ్వరావు ఇంటి వద్ద బోడ వజ్రం అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా బాబు మాట్లాడుతూ మహాసభకు జిల్లాలోని 400 మంది ప్రతినిధులు హాజరవుతున్నారని తెలిపారు. ఈ సమావేశంలో గ్రామ శాఖ కార్యదర్శి ముల్లగిరి నాగేశ్వరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు కందర్ల గురవయ్య, సహాయ కార్యదర్శి దంతా కృష్ణ, శాఖ సహాయ కార్యదర్శి తొర్లపాటి రామ, శాఖ సభ్యులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి

ప్రజాశక్తి - ముదినేపల్లి

ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి చెందిన సంఘటన మండలంలోని శ్రీహరిపురంలో ఉన్న గ్రోవెల్ ఫ్యాక్టరీ గోడౌన్ వద్ద శనివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఎన్‌టిఆర్ జిల్లా కంచికచర్లకు చెందిన లారీ డ్రైవర్ నాగుల్ మీరా(29) నూకల లోడుతో శ్రీహరిపురం గ్రోవెల్ ఫ్యాక్టరీ గోడౌన్ వద్దకు అన్‌లోడ్ నిమిత్తం వచ్చాడు. డ్రైవర్ లారీని గోడౌన్ ప్రాంగణంలోకి రివర్స్ చేస్తుండగా లారీ ఊహించని విధంగా కిందికి కదిలింది. ఆ సమయంలో వెనుక వైపునకు డ్రైవర్ లారీ కిటికీ వెలుపల తన తలను ఉంచి చూస్తుండగా ప్రమాదవశాత్తూ లారీ కిందికి కదిలి, ఆయన తల లారీ, గోడౌన్ గోడ మధ్య నలిగి తీవ్ర గాయమైంది. అతన్ని వెంటనే అత్యవసర వైద్య చికిత్స కోసం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఆదివారం తెల్లవారుజామున మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

250 కిలోల వెంట్రుకలు చోరీ

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

వెంట్రుకల దుకాణంలో దాచిన 150 కేజీల వెంట్రుకలు అపహరణకు గురయ్యాయని యజమాని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఏలూరు రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఏలూరు రూరల్ మండలం మాదేపల్లి గ్రామానికి చెందిన కటారి వేమయ్య స్థానికంగా వెంట్రుకల దుకాణాన్ని నిర్వహిస్తున్నాడు. కుటుంబ సభ్యులతో కలిసి ఈ నెల 17వ తేదీన బంధువుల ఇంటికి వెళ్లాడు. ఆదివారం ఇంటికి వచ్చి చూసేసరికి దుకాణం తలుపులు పగలకొట్టి ఉన్నాయి. అందులో ఉండాల్సిన 150 కేజీల వెంట్రుకలు అపహరణకు గురైనట్లు గుర్తించి ఏలూరు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుమార్తె కన్పించడంలేదని తల్లిదండ్రుల ఫిర్యాదు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

కుమార్తె కన్పించడంలేదని తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఏలూరు రూరల్ మండలం బొర్రంపాలెం ప్రాంతానికి చెందిన వెంకటేశ్వరరావు స్థానికంగా కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఆయన కుమార్తె ఆదివారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లింది. సాయంత్రానికి కూడా తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాయింట్ల సీలింగ్‌తో ఉపాధ్యాయుల్లో ఆందోళన

3, 4 కేటగిరిల్లో పనిచేస్తున్న వారికి తీవ్ర నష్టం

ప్రజాశక్తి - మండవల్లి

కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక నూతనంగా తయారు చేసిన ఉపాధ్యాయ బదిలీల చట్టం వల్ల కొంతమంది ఉపాధ్యాయులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఉపాధ్యాయ సంఘాలు అనేక ప్రతిపాదనలు తీసుకొచ్చినప్పటికీ ప్రభుత్వం తాను అనుకున్న దిశ గానే ముందుకు వెళ్తుంది. స్టేషన్ పాయింట్లు ఎనిమిదేళ్లకే పరిమితం చేయడంతో మూడు, నాలుగు కేటగిరిల్లో పనిచేసిన ఉపాధ్యాయులు తీవ్రంగా నష్టపోతున్నారు. అందులో అనేకమంది ఉపాధ్యాయులు హేతుబద్ధీకరణకు గురై మళ్లీ తిరిగి దూర ప్రాంతాలకు బదిలీ కానున్నారు.

మున్సిపల్‌కు, జిల్లా పరిషత్‌కు పోలిక ఏంటి?


మున్సిపల్ కార్పొరేషన్‌లో కొనేళ్లుగా బదిలీలు జరగకపోవడంతో ఏళ్ల తరబడి ఉపాధ్యాయులు అక్కడే ఉన్నారు. ప్రస్తుతం జిల్లా, మండల పరిషత్ యాజమాన్యాలతో పాటు వారికి కూడా బదిలీలు జరుగుతున్నాయి. అయితే మున్సిపల్ ఉపాధ్యాయులను దృష్టిలో పెట్టుకుని స్టేషన్ పాయింట్లు సీలింగ్ చేయడంతో జిల్లా, మండల పరిషత్ యాజమాన్యంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు తీవ్రంగా నష్టపోతున్నారు. మున్సిపల్ పాఠశాలల ఉపాధ్యాయులు అయితే పది కిలోమీటర్ల లోపు బదిలీలు జరుగుతాయని, అదే జిల్లా పరిషత్ యాజమాన్యంలో అయితే వందల కిలోమీటర్లు బదిలీలు జరుగుతాయని, మున్సిపల్ ఉపాధ్యాయులకు, మండల పరిషత్ ఉపాధ్యాయులకు పోలిక ఏంటని ప్రశ్నిస్తున్నారు. సీలింగ్ విధానం వల్ల ఆరు నుంచి ఎనిమిది పాయింట్లు కోల్పోతున్నామని దీనిని సరిచేయాలని కోరుతున్నారు.

గతంలో మార్పు

ఇదే విధంగా 2021, 2023లలో జరిగిన బదిలీల్లో కూడా మొదట్లో ప్రభుత్వం ఎనిమిదేళ్ల సీలింగ్ పెట్టినప్పటికీ సంఘాల విజ్ఞప్తితో సీలింగ్ విధానాన్ని తీసివేశారని ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నారు. విద్యాశాఖ మంత్రి మెజారిటీ సంఘాల అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకుని సరిచేయాలని తెలపడంతో సంఘాలన్ని కూడా కేటగిరి మూడు, నాలుగుల్లో పనిచేస్తున్న న్యాయం చేయాలని కోరుతున్నారు. దరఖాస్తు గడువు త్వరలో ముగియనుండటంతో ఉపాధ్యాయుల్లో మరింత తీవ్ర ఆందోళన నెలకొంది.

పదేళ్లు కేటాయించాలి


బొర్రా గోపీమూర్తి, పిడిఎఫ్ ఎంఎల్‌సి



మూడు, నాలుగు కేటగిరీల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు తీవ్ర నష్టం కలుగుతుంది. అందులో ఎలాంటి సందేహం లేదు. కనీసం పదేళ్లస్టేషన్ పాయింట్లు కేటాయించాలని విజ్ఞప్తి చేశాం. మరోసారి ఈ విషయంపైన మాట్లాడతాం.

పోలిక సరికాదు

బేతల రాజేంద్రప్రసాద్, ఎపిటిఎఫ్ నాయకులు



రేషనలైజేషన్‌కు గురవుతున్న ఉపాధ్యాయులకు తీవ్ర నష్టం కలుగుతుంది. జెడ్‌పి ఉపాధ్యాయులకు మున్సిపల్ వారికి పోలిక సరికాదు. పూర్తి స్టేషన్ పాయింట్లు కేటాయించాలి.

రావులపర్రు వంతెన నిర్మాణ పనులు ప్రారంభం

రూ.70 లక్షల నిధులు మంజూరు

ప్రజాశక్తి - ఉంగుటూరు

రావులపర్రు - ప్రకాశరావుపాలెం ఆర్ అండ్ బి ఆధ్వర్యంలోని రావులపర్రు వద్ద పత్తేపురం పంటకాలువపై వంతెన నిర్మాణానికి ప్రభుత్వం రూ.70 లక్షల నిధులు మంజూరు చేసింది. దీంతో ఆదివారం పనులు ప్రారంభించారు. 2019లో ఇక్కడి వంతెన కూలింది. రావులపర్రు, దొంతవరం, రాచూరు తదితర గ్రామ ప్రజలు అప్పటి నుంచి ఆమార్గంలో రాకపోకలకు ఎంతో ఇబ్బంది పడ్డారు. అనేక పర్యాయాలు ప్రజాశక్తిలో అనేక కథనాలు సైతం ప్రచురితమైన సంగతి పాఠకులకు విదితమే. గత ప్రభుత్వంలో పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో ఈ వంతెన ఆరేళ్లుగా నిరుపయోగంగా మారింది. ఈ క్రమంలో ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నిధులు తేవడంలో రూ.70 లక్షలతో ఆరు మీటర్ల పొడవు 12 మీటర్ల వెడల్పుతో కొత్తగా వంతెన నిర్మాణం పనులు ప్రారంభించినట్లు ఎఇ భాస్కరరావు ప్రజాశక్తికి వెల్లడించారు. పాత బ్రిడ్జి ఫిల్లర్స్ శిథిలాలను యంత్రాల సాయంతో తొలగించి అదే ప్రాంతంలో కొత్తగా నిర్మాణం చేయనున్నారు.



పాత వంతెన తొలగింపు పనులు

ఎస్‌సి వాణిజ్య సముదాయం తనిఖీ

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

మండల కేంద్రమైన కొయ్యలగూడెం పట్టణంలో కన్నాపురం రోడ్డులోని మీ సేవా కేంద్రం పక్కన ఉన్న ఎస్‌సి మాదిగ కార్పొరేషన్ ద్వారా నిర్మితమైన వాణిజ్య సముదాయాన్ని ఆ సంస్థ ఇడి ముక్కంటి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేసి భవన స్థితిగతులను పరిశీలించారు. ఈ మేరకు అక్కడ వ్యాపారం చేసుకుంటున్న వారి జీవనోపాధి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎస్‌సి కార్పొరేషన్ ఛైర్మన్ ఉండవల్లి శ్రీదేవి, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లాలో ఉన్న ఎస్‌సి వాణిజ్య సముదాయాల స్థితిగతులను తెలుసుకునేందుకు ఉమ్మడి జిల్లాలోని దూబచర్ల, నల్లజర్ల, కొయ్యలగూడెం, బుట్టాయగూడెంలో పర్యటించినట్లు తెలిపారు. చాలా చోట్ల భవనాలు శిథిలావస్థలో ఉన్నాయని, మరమ్మతు పనులకు ప్రతిపాదనలు పంపుతామన్నారు. అదేవిధంగా ప్రభుత్వ స్థలాలు ఉంటే పంచాయతీ తీర్మానంతో వస్తే ఎస్‌సి అభ్యున్నతి కోసం వ్యాపారాలు చేసుకునేందుకు నూతన సముదాయాల నిర్మాణానికి కూడా ప్రభుత్వానికి ప్రతిపాదిస్తానని చెప్పారు. ప్రభుత్వం ఇటీవల ఎస్‌సి కార్పొరేషన్ రుణాలకు అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తుందని, ఆసక్తి ఉన్న యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏళ్ల తరబడి కొందరి చేతుల్లోనే కొయ్యలగూడెం దుకాణాలు ఉన్నాయని, ఈసారి వేలం నిర్వహించి అర్హులకు కేటాయించాలన్నారు. ఆయనతో పాటు డిప్యూటీ తహశీల్దార్ వెంకటలక్ష్మి కుమారి, ఆర్ఐ మణి దివ్య, గ్రామ రెవెన్యూ అధికారులు అడపా రాంబాబు, సిరిగినీడి సుబ్బారావు, మధు తదితరులు ఉన్నారు.

చెస్ పోటీలు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

నగరంలో ఒకేసారి 25 మంది చెస్ ప్లేయర్లతో అంతర్జాతీయ రిటైర్డ్ ప్లేయర్ కుమారుడు గంజి అభిషేక్ అబ్రహం తలపడ్డారు. ఏలూరులోని ఆర్ఆర్.పేటలో ఉన్న ఏలూరు పబ్లిక్ స్కూల్ ఆవరణలో ఆదివారం నిర్వహించిన చెస్ పోటీలను గ్యారే కాస్పరవ్ చెస్ అకాడమీ డైరెక్టర్ గంజియోహానన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణ తరగతుల్లో భాగంగా పోటీలు నిర్వహించినట్లు చెప్పారు.

మహానాడు జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

ఈ నెల 27, 28, 29 తేదీల్లో కడప జిల్లాలో జరిగే మహానాడు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టిడిపి కొయ్యలగూడెం మండలాధ్యక్షులు పారేపల్లి నరేష్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కొయ్యలగూడెం మండలం నుంచి టిడిపి నాయకులు, కార్యకర్తలు భారీ స్థాయిలో హాజరు కావాలని పిలుపునిస్తున్నట్లు తెలిపారు. హాజరు కాలేని నాయకులు, కార్యకర్తలు 28వ తేదీన టిడిపి వ్యవస్థాపకులు, కీర్తిశేషులు నందమూరి తారక రామారావు జయంతి వేడుకలను నిర్వహించాలని తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - ముసునూరు

మండల కేంద్రమైన ముసునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2002-2003లో పదో తరగతి చదివిన వారు ఆదివారం సమ్మేళనమయ్యారు. పూర్వ విద్యార్థులందరూ ఆత్మీయంగా పలకరించుకుని చిన్ననాటి మధుర స్మృతులు నెమర వేసుకున్నారు. యాంకర్‌గా మానికల గంగాధరరావు వ్యవహరించారు. పాఠశాల సమయంలో గడిపిన మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆనందంగా గడిపారు. ఆటలు, పాటలు, జోక్స్ వేసుకుంటూ సందడి చేశారు. గతంలో ఆ పాఠశాలకు పూర్వ విద్యార్థి మానికల గంగాధరరావు సుమారు రూ.50 వేలు విలువైన కంప్యూటర్లను వితరణగా అందించినట్లు చెప్పారు. పాఠశాల అభివృద్ధికి వరింత సహకారం, తోడ్పాటు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మానికల గంగాధరరావు, నక్క యోహాను, తోట వడ్డీ కాసులు, తలకొండ వడ్డీ కాసులు, బుడుపుల ఏలియా పాల్గొన్నారు.



సమావేశమమైన పూర్వ విద్యార్థులు

190 మందికి ఉచిత వైద్య పరీక్షలు

టి.నరసాపురం : మండలంలోని బొర్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫర్ ద పీపుల్ యూత్ ఆధ్వర్యంలో ఆదివారం విజయవాడ మణిపాల్ హాస్పిటల్ వైద్య బృందంతో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని బొమ్మగాని బాలకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఫర్ ద పీపుల్ యూత్ కన్వీనర్ కలపర్తి విజయ్ మాట్లాడుతూ ఈ ఉచిత వైద్య శిబిరంలో కేన్సర్, గుండె వ్యాధలకు సంబంధించిన 190 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. ఉచిత వైద్య శిబిరాలు గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ఎంతగానో దోహదపడతాయని ఆయన తెలిపారు. వీర్రాజు, సూర్య, సురేష్, రాజేష్, అనిల్ పాల్గొన్నారు.



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య బృందం

యోగాంధ్రాలో భాగస్వామ్యం కావాలి : జెసి

ప్రజాశక్తి - ఏలూరు

జూన్ 21వ తేదీన నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ఏలూరు జిల్లా ప్రజలందరి భాగస్వామ్యం పెద్ద ఎత్తున కావాలని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి విజ్ఞప్తి చేశారు. స్థానిక జాయింట్ కలెక్టర్ బంగ్లా నుంచి యోగాంధ్ర కార్యక్రమ నిర్వహణపై సంబంధిత అధికారులతో ఆమె ఆదివారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటికే 200 మంది మాస్టర్ ట్రైనీలకు శిక్షణ అందించారని, వీరు ప్రతి సచివాలయ పరిధిలో మరో పది మంది ట్రైనీలకు శిక్షణ అందించే కార్యక్రమాన్ని చురుగ్గా చేపట్టాలని సంబంధిత అధికారులు ఆదేశించారు. మండల స్థాయిలో 5,445 మంది యోగా ట్రైనీలను అందుబాటులో ఉంచాలన్నారు. గ్రామ, మండల, జిల్లాస్థాయిలో యోగాంధ్ర పోటీలను నిర్వహించాలన్నారు. గ్రామ, వార్డు స్థాయిలో ఈ నెల 26 నుంచి 30వ తేదీ వరకు మండల స్థాయిలో జూన్ రెండో తేదీ నుంచి ఏడో తేదీ వరకు, జిల్లాస్థాయిలో జూన్ తొమ్మిదో తేదీ నుంచి 14వ తేదీ వరకు నిర్వహించాలన్నారు. యోగాంధ్ర ప్రాధాన్యతను తెలిపే విధంగా జూన్ 21వ తేదీ అంతర్జాతీయ యోగాలో పాల్గొనేందుకు క్యూ ఆర్ కోడ్ లేదా వెబ్ ద్వారా ప్రతి ఒక్కరూ నమోదు కావాలని సూచించారు. %https://yogandhra.ap.gov.in/#/home/laun-chone% లింక్ ద్వారా నమోదు కావాలని తెలిపారు.

యోగాను క్రమం తప్పకుండా సాధన చేయడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయని ఆయూష్ శాఖ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ లక్ష్మీసుభద్ర ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. యోగా ఒత్తిడికి ప్రసిద్ధ విరుగుడని, మెరుగైన నిద్ర విధానాలను ప్రోత్సహి స్తుందని తెలిపారు. యోగాలో అనేక రకాలున్నాయని, కానీ ప్రతి ఒక్కటి తప్పనిసరిగా శ్వాస అవగాహనతో సాధన చేసే నిర్మాణాత్మక భంగిమలు (ఆసనాలు)పై ఆధారపడి ఉంటుందని పేర్కొన్నారు.

ఏలూరు సిటీ : నగరంలోని అన్ని తరగతుల ప్రజలు యోగాంధ్ర కార్యక్రమాల్లో భాగస్వాములై విజయవంతం చేయాలని ఏలూరు నగరపాలక సంస్థ కమిషనర్ ఎ.భానుప్రతాప్ కోరారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఏలూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం కార్పొరేషన్ కార్యాలయంలో యోగా శిక్షణా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డు, సచివాలయాల సిబ్బంది యోగాంధ్రా కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించి వారి పేర్లను యోగాంధ్ర యాప్‌లో నమోదు చేయాలని ఇప్పటికే సూచించామన్నారు. ప్రజల్లో యోగాపై అవగాహన కల్పించేందుకు ఈ నెల 27న పెద్దఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

బెట్టింగులు.. ఛిద్రమవుతున్న జీవితాలు..!

ఐపిఎల్ మ్యాచ్‌లపై బెట్టింగులకు పాల్పడుతున్న యువత

అప్పులపాలవుతున్న వైనం


యాప్‌ల ద్వారా బెట్టింగ్ నిర్వహణ

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ప్రస్తుతం ఐపిఎల్ సీజన్ నడుస్తున్న నేపథ్యంలో క్రికెట్ ప్రేమికులకు ఇదొక ఆనందాన్నిచ్చే ఆట. కాని బెట్టింగులూ పెద్దఎత్తున సాగుతున్నాయి. మునుపటి రోజుల్లో క్రికెట్ బెట్టింగ్ నిర్వహించాలంటే కచ్చితంగా ఒక కంప్యూటర్ లేదా ల్యాప్‌టాప్ దానికి తోడుగా ఒక వైఫై కనెక్షన్, నాలుగు నుంచి పది సెల్ ఫోన్లు, ఒక గది కచ్చితంగా అవసరం ఉండేది. కాని ఇప్పుడు అది కాస్తా మరింత అత్యాధునిక సబగులను అద్దుకుని ఏకంగా సెల్‌ఫోన్‌లోనే క్రికెట్ బెట్టింగ్ యాప్‌లు నిర్వహించే స్థాయికి చేరుకుంది. ఈ బెట్టింగులకు పాల్పడినవారు ఎక్కువగా అప్పులపాలై తమ కుటుంబాలను రోడ్డుకు తెచ్చిన ఘటనలు అనేకం ఉన్నాయి. ఆత్మహత్యకు పాల్పడినవారు ఉన్నారు. పోలీసులు చర్యలు తీసుకోవడానికి ప్రయత్నించినప్పటికీ సెల్‌ఫోన్‌లో క్రికెట్ బెట్టింగ్ యాప్‌లను వినియోగించుకుని బెట్టింగులకు పాల్పడుతుండడంతో పోలీసులు కూడా చేసేదేమీ లేక చూస్తూ ఉండిపోతున్నారు. బెట్టింగులకు పాల్పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని పోలీసులు అవగాహన కల్పిస్తున్నారు.

ప్రస్తుతం బెట్టింగ్ జరిగేది ఇలా...

గతంలో మాదిరిగా స్థావరాలను ఏర్పాటు చేసుకునే అవసరం బెట్టింగ్ నిర్వాహకులకు లేకుండా పోయింది. వీరు ప్రత్యేకంగా ఒక యాప్‌ను ఏర్పాటు చేసుకుంటున్నారు. వీరు స్థానికంగా యాప్‌లను కూడా డెవలప్ చేస్తున్నారు. కాని నిర్వాహకులు మాత్రం ఎక్కడో ఉండి వీటిని మానిటరింగ్ చేస్తున్నారు. బెట్టింగులకు పాల్పడేవాళ్లు ఆ యాప్‌ను తమ ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేసుకోవడం లేదా గూగుల్ పేజీలో ఈ యాప్‌ను మ్యాచ్ జరుగుతున్నంత సేపు తమ స్క్రీన్‌పై ఉంచుకోవడం వంటివి చేస్తూ బెట్టింగులకు పాల్పడుతున్నారు. ముందుగానే డబ్బులు ఈ యాప్‌లో చెల్లించి బెట్టింగులకు పాల్పడాలి. ఒకవేళ గెలిస్తే ఆ యాప్‌లో నిల్వలో ఉన్న సొమ్ము మొత్తం తమ ఖాతాకు మళ్లించుకోవచ్చు. లేదా నిల్వలో ఉన్న సొమ్మును తిరిగి మళ్లీ బెట్టింగ్ వినియోగించుకోవచ్చు. ఇలా అంతా ఆన్‌లైన్‌లోనే జరిగిపోతుంది.



యాప్‌కు సంబంధించిన వివరాలు ఇస్తే వారి ఆట కట్టిస్తామని, తెలిపిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని చెబుతున్నారు. గతేదాడితో పోలిస్తే క్రికెట్ బెట్టింగ్ నిర్వాహకులు మరింత బలంగా పోలీసులకు చిక్కకుండా తమ తమ యాప్‌లను డెవలప్ చేస్తున్నారు. అయితే వీటిని పట్టుకునేందుకు పోలీసులు ప్రయత్నిస్తే వేరొక రాష్ట్రం నుంచి వీటిని ఆపరేట్ చేస్తున్నట్లు గూగుల్ లొకేషన్‌లో చూపించడం విశేషం. నిందితులను పోలీసులు పట్టుకోలేకపోవడానికి నిర్వాహకుడు వాటి వివరాలు తెలియజేయక పోవడం ప్రధాన కారణం. వీటికి నిరోధించేందుకు ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను డెవలప్ చేస్తున్నట్లు పోలీసులు చెబుతున్నారు.

కొయ్యలగూడెం : మండలంలో యువత సెల్‌ఫోన్‌లో యాప్‌లు ఇన్‌స్టాల్ చేసుకుని ఆన్‌లైన్‌లో బెట్టింగులకు పాల్పడుతున్నారు. కొంతమంది ఈ యాప్స్‌ను డబ్బు సంపాదనకు సులభమైన మార్గంగా భావిస్తున్నారు. కొయ్యలగూడెం మండలంలో స్థానిక యువత ఈ యాప్స్‌ను సులభంగా డౌన్‌లోడ్ చేసి ఐపిఎల్ క్రికెట్ మ్యాచ్‌లు, ఫుట్‌బాల్ లీగ్‌లు, రమ్మీ, పోకర్ వంటి గేమ్‌లు తమ ఇళ్లలోనే ఆడుతున్నారు. మండలంలో యువత ఎక్కువగా క్రికెట్ బెట్టింగ్, రమ్మీ వంటి కార్డ్ గేమ్‌లను ఆడుతున్నారు. ఈ యాప్స్ వల్ల సామాజిక, ఆర్థిక పరిణామాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. స్థానిక సామాజిక కార్యకర్తలు, యువత ఈ యాప్స్‌లో డబ్బు కోల్పోయి అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని స్థానికులు చెబుతున్నారు. ఒక సంఘటనలో ఒక యువకుడు బెట్టింగ్‌లో రూ.40 వేలు కోల్పోయి ఆ డబ్బును తిరిగి గెలవాలని మరింత ఆడి, చివరకు మరింత నష్టపోయాడు. ఇలాంటి సంఘటనలు మండలంలో ఆందోళన కలిగిస్తున్నాయి. మండల అధికారులు ఈ విషయాలపై అవగాహన కల్పిస్తున్నారు. యువతను బెట్టింగ్ యాప్స్ నుంచి దూరంగా ఉంచేందుకు వృత్తి శిక్షణ, ఉపాధి అవకాశాలను పెంచాలని సామాజిక సంస్థలు కోరుతున్నాయి. అధికారులు కూడా స్కూళ్లు, కళాశాలల్లో ఈ యాప్స్ గురించి విద్యార్థులకు హెచ్చరికలు జారీ చేయాలని సూచిస్తున్నారు.